నేడు మండల సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 22 : అబ్దుల్లాపూర్‌మెట్ మండల సర్వ సభ్య సమావేశాన్ని ఎంపీపీ బుర్ర రేఖ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మమతాబాయి తెలిపారు. హయత్‌నగర్‌లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరవ్వాలన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కడ్తాల్, జనవరి 22 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం తన పుట్టినరోజు మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్‌గౌడ్, అశోక్, రామచంద్రయ్య, నాగార్జున్, వెంకటేశ్, రాజేశ్, శేఖర్, సురేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, జనవరి 22 : మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన కనకల చంద్రయ్య అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ ఫోరం జిల్లా కార్యదర్శి బొప్పిడి గోపాల్ స్థానిక నాయకులతో కలిసి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మల్లేశ్‌యాదవ్, నాయకులు బీరప్ప, భిక్షపతి, శ్రీశైలం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

కడ్తాల్, జనవరి 22 : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో సీతారాములస్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయాన్ని కొబ్బరి, మామిడాకు తోరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, ఉప సర్పంచ్ అజీజ్, వార్డు సభ్యులు, నాయకులు శ్రీరామ్, బాలకిష్టయ్య, యాదగిరిరెడ్డి, విష్ణువర్ధన్‌యాదవ్, రాఘవేందర్‌గౌడ్, రాజు, నరేందర్‌గౌడ్, నర్సిరెడ్డి, విజయ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, సుదర్శన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : సీతారాంపూర్ సీతారామస్వామి దేవాలయంలో బోనాలతో స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్ : ప్రత్యేక అలంకరణలో స్వామివారు

షాద్‌నగర్‌టౌన్ : వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులు

ఊరూరా.. రామనామ స్మరణ

- రామనామ స్మరణతో మార్మోగిన దేవాలయాలు
- స్క్రీన్‌ల ద్వారా అయోధ్య బాలరామ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించిన భక్తులు
- ఊరూరా పూజలు, భజనలుత, అభిషేకాలు, అన్నదానాలు, ఊరేగింపులు
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

ఇబ్రహీంపట్నం, జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గ్రామాలన్నీ రామనామ స్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే గ్రామాల్లోని ఆలయాల్లో రామునికి ప్రత్యేక పూజలతో పాటు భజనలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఇండ్లముందు రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం ఆలయాల్లో జరిపిన ప్రత్యేక పూజల్లో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని త్రిశక్తి దేవాలయంలో రాముడికి, ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపు నిర్వహించారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, అర్చనలు, హారతులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీని ఏర్పాటు చేశారు. భక్తులు రాముడిని స్మరిస్తూ గీతాలు ఆలపిస్తూ, బతుకమ్మ ఆడారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, శేఖర్, మహేశ్, రాజేశ్, భానుకిరణ్, జగదీశ్, తరుణ్, అర్చకులు భానుప్రసాద్, శ్రీమన్నారాయణ, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్ : కాషాయ జెండాలతో పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. సోమవారం ఉదయం నుంచే దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీరామ నామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్‌ల ద్వారా అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని భక్తులు వీక్షించారు. రామ భక్తులు దేవాలయ ఆవరణలో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. షాద్‌నగర్‌లోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరం, వేంకటేశ్వరస్వామి, చౌడమ్మగుట్ట వీరాంజనేయస్వామి దేవాలయాలతో పాటు ఆయా దేవాలయాల్లో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. చౌడమ్మగుట్ట వీరాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి రమేశ్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొందుర్గు, చౌదరిగూడ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లోని శ్రీరాముడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్షింతలను పూజల అనంతరం తలపై చల్లుకున్నారు. కేశంపేట మండల కేంద్రంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తూరు మండల కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ లావణ్య, నందిగామ మండలంలోని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విగ్రహాల ఊరేగింపు

శంకర్‌పల్లి : వివిధ ఆలయాల్లో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మున్సిపాలిటీలో భారీ సంఖ్యలో యువకులు శోభాయాత్రను చేపట్టారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ శ్వేత, వాణి పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : మండల కేంద్రంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి పల్లకిలో స్వామివారిని ఊరేగించారు. హనుమాన్ దేవాలయం ముందు స్క్రీన్ ఏర్పాటు చేశారు.

ఆమనగల్లు : పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు తల్లోజు విజయకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, నాయకులు చెన్నకేశవులు, పాపిశెట్టి రాము, మాధవచారి, యాదగిరి, ప్రభాకర్, అశోక్, విష్ణు, శివశంకర్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : గ్రామాల్లో శ్రీరాముని చిత్ర పటాలు, ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. అజీజ్‌నగర్ గ్రామంలో ఉత్సవ విగ్రహంతో డీజే ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ దేవాలయంలో రెండు ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. జైశ్రీరాం నినాదాలతో గ్రామాలు మార్మోగాయి.

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆలయం నుంచి చిలుకూరు గ్రామంలోని హనుమాన్ దేవాలయం వరకు మహా పాదయాత్రను ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి ప్రారంభించారు. కళాకారుల డప్పుల దరువు ఆకట్టుకున్నది. మహిళలు బోనాలతో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీకాంత్, సర్పంచ్ స్వరూప, నాయకులు గోపాల్‌రెడ్డి, జయవంత్, నర్సింహగౌడ్, చెన్నయ్యయాదవ్, ఆంధ్రూ, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, మల్లారెడ్డి, రాజు, కిషన్ పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : ముడిమ్యాల్ గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసి భక్తులు తిలకించేందుకు వీలు కల్పించారు. స్వామివారి పల్లకి సేవ నిర్వహించి పూజా కార్యక్రమాల అనంతరం అన్నదానం చేశారు.

మొయినాబాద్ : చిలుకూరులో చేపట్టిన పాదయాత్రలో బోనాలతో మహిళా కళాకారులు

శ్రీరాముడి జీవనశైలిని అలవర్చుకోవాలి

- ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, జనవరి 22: ప్రతి ఒక్కరూ శ్రీరాముడి జీవన శైలిని అలవర్చుకోవాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా షాబాద్ మండలంలోని సీతారాంపూర్ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజలో వారు పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో భక్తులు శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు బోనాలతో స్వామివారికి మొక్కులు చెల్లిం చుకున్నారు. షాబాద్ మండల కేంద్రంలో శ్రీరాముడి శోభాయాత్ర ఘనం గా నిర్వహించారు. నాగరగూడ నుంచి సీతారాంపూర్ వరకు భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్, సర్పంచ్‌లు కొత్త పాండురంగారెడ్డి, సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు.

మంచాల : జాపాలలో బాలరాము ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్ : మండలంలోని రాయపోల్ గ్రామంలో పూజలో పాల్గొన్న గ్రామ పెద్దలు

షాద్‌నగర్‌రూరల్ :లింగారెడ్డిగూడ గ్రామంలో ఆంజేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఇండోర్ స్టేడియానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్లు రాజేందర్, దండెం కృష్ణారెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 22 : పెద్దఅంబర్‌పేటలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. హిందూ మిత్ర యూత్ క్లబ్ వారి కోసం తన వార్డు నుంచి రూ. 5 లక్షల నిధులు కేటాయించగా.. స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు కౌన్సిలర్ పసుల రాజేందర్ ముదిరాజ్ అన్నారు. పనులు శరవేగంగా పూర్తయ్యేందుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి, పండుగల రాజు, హిందూ మిత్ర యూత్ సభ్యులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా తాండూరులో ..

సెల్‌ఫోన్ విషయంలో ఒకరిపై దాడి

ధారూరు, జనవరి 22 : సెల్‌ఫోన్ విషయంలో గొడవపడి ఒకరిపై దాడి చేసిన ఘటన ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగింది. ధారూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుదేరా మండలం పిల్లోడి గ్రామానికి చెందిన గొల్ల నర్సింహులు, ముడిపల్లి అంబయ్య, కుర్వ శ్రీను, బోయ ఫకీరప్ప రోజు మాదిరిగానే ఆదివారం కూలీ పని ముగించుకొని వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో రాత్రి పడుకున్నారు. ఫకీరప్ప సెల్‌ఫోన్‌ను కుర్వ శ్రీను అదేరాత్రి సినిమా చూస్తానని తీసుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో గొడవపడ్డారు. ఈ క్రమంలో మద్యం తాగి, ధారూరు మండల పరిధిలోని మున్నూరు సోమారం చెరువుకు వెళ్లి స్నానం చేశారు. అక్కడ అంబయ్యను కట్టేసి అనంతరం రుద్రారం అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. కుర్వ శ్రీనును సెల్‌ఫోన్ విషయం అడగగా తనకు తెలియదని చెప్పాడు. గొల్ల నర్సింహులుపై శ్రీను, ఫకీరప్పలకు అనుమానం వచ్చింది. దీంతో నర్సింహులును ఫకీరప్ప పట్టుకోగా.. శ్రీను సీసా పగులగొట్టి నర్సింహులు గొంతు కోయడంతో రక్తం రాగా.. భయమేసి పారిపోయారు. నర్సింహులు రుద్రారం సమీపంలోని రోడ్డుపైకి రావడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు నర్సింహులును వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారమందిస్తా

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కంజాల్, జనవరి 22 : మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతుతూ.. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్‌లు నక్క శివలింగం, సునీల్, మంగమ్మ, నాయకులు మేకం అంజయ్య, గోపాల్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

షాబాద్, జనవరి 22: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో మాంటిస్సోరీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. ఆటలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఖోఖో, కబడ్డీ, క్యారంబోర్డ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో జార్జ్ థామస్, కరస్పాండెంట్ షాబాద్ మహేశ్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కల్వకోల్ వెంకట్‌యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 22 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బండి నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులుగా రెడ్డిమల్ల యాదయ్య, బర్తాకి యాదగిరి, బోడ సత్తయ్య, ఆముదాల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కొల్కులపల్లి క్రాంతికుమార్, కోశాధికారిగా బుద్ధి దీపక్, జాయింట్ సెక్రటరీలుగా శ్రీహరి, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొయినాబాద్, జనవరి 22 : విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు ఆనుతున్న నేపథ్యంలో చెట్ల కొమ్మలను మంగళవారం తొలగించనున్నామని.. దీంతో కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ ఏఈ హనుమానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కనకమామిడి ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాల ఫీడర్‌లో మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు, తోలుకట్టా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని చెప్పారు. మూడు ఫీడర్ల పరిధిలో ఉన్న కనకమామిడి, నక్కలపల్లి, ఎతుబార్‌పల్లి, తోలుకట్టా గ్రామాలతోపాటు ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాలకు విద్యుత్ సరఫరా ఉండదని.. ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

చిలుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో..

చిలుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మొయినాబాద్-2 ఫీడర్‌లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎస్‌పీఎస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజేశ్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు ఫీడర్ల పరిధిలోని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్‌గేట్ గ్రామాలతోపాటు జేబీఐఈటీ కళాశాల, ఎన్కేపల్లి గ్రామ పరిధిలోని కొంత భాగానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలడంతో విద్యుత్ ట్రిప్ అవుతున్న నేపథ్యంలో చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు చెప్పారు. ఈ విషయమై విద్యుత్ సిబ్బందికి సహకారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు.